బాణసంచా స్టాళ్ల పేరిట దందా

- స్టాల్ ఏర్పాటుకు రూ.55 వేలు వసూలు
- అనుమతి లేదంటూ.. పలువురు వ్యాపారులకు మొండిచెయ్యి
- చక్రం తిప్పుతున్న ఎంవీపీ దివాళి క్రాకర్స్ వెల్ఫేర్ అసోసియేషన్



ఏఎస్ రాజా మైదానంలో స్టాళ్ల ఏర్పాటుకు ప్రస్తుతం జరుగుతున్న పనులు



ఎంవీపీ కాలనీ ఏఎస్ రాజా మైదానంలో బాణసంచా విక్రయాలు(ఫైల్)

ఎంవీపీకాలనీ: దీపావళి దుకాణాల ఏర్పాటు పేరుతో భారీ దోపిడీ జరుగుతోంది. క్రాకర్స్ విక్రయాల్లో వసూళ్ల దందాకు ఎంవీపీ కాలనీ వేదికగా మారింది. ఎంవీపీ దివాళి క్రాకర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ పేరుతో కొందరు కూటమి నాయకులు ఈ దందాకు తెరలేపారు. గతంలో క్రాకర్స్ అసోసియేషన్ల మధ్య ఉన్న ఒప్పందాన్ని తుంగలోకి తొక్కి, వారికి నచ్చిన వ్యాపారులకు స్టాళ్ల కేటాయించడంతోపాటు అనుమతులు పేరిట భారీగా వసూళ్లకు పాల్పడుతున్నారు. జీవీఎంసీ, పోలీసు అధికారుల అనుమతులు తమ చేతుల్లో పని అని, తాము చెప్పినంత చెల్లిస్తేనే మీకు స్టాల్లు లభిస్తాయని హెచ్చరిస్తున్నట్లు పలువురు పేర్కొంటున్నారు. గతంలో వైఎస్సార్‌సీపీ, టీడీపీకి చెందిన రెండు అసోసియేషన్ల వ్యాపారులు ఎంవీపీ కాలనీ ఏఎస్ రాజా మైదానం వేదికగా దీపావళి బాణసంచా విక్రయించే వారు. 50 వరకు స్టాళ్లు మైదానంలో ఏర్పాటుకు అనుమతులు తీసుకొని సమన్వయంతో విక్రయాలు జరిపేవారు. వైఎస్సార్‌సీపీ అధికారంలో ఉన్న ఐదేళ్లు ఏ వ్యాపారికి ఇబ్బంది లేకుండా ఇదే విధానాన్ని పాటించారు. ప్రస్తుతం కొందరు కూటమి నాయకులు అక్రమ వసూళ్ల కోసం సగం మంది వ్యాపారులకు స్టాళ్లు కేటాయించకుండా గండికొట్టినట్లు పలువురు విమర్శిస్తున్నారు.

రూ.55 వేలు వసూలు

గతంలో ఎన్నడూ లేని విధంగా భారీ వసూళ్లకు ఎంవీపీ దివాళి క్రాకర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ తెరలేపింది. గతంలో 50 స్టాళ్లకు అనుమతులు లభించే ఏఎస్ రాజా మైదానంలో 32 స్టాళ్లకు మాత్రమే అనుమతి లభించిందంటూ పలువురు క్రాకర్స్ వ్యాపారులకు మొండిచెయ్యి చూపారు. ఏటా ఏఎస్ రాజా మైదానంలో స్టాల్ అనుమతికి రూ.35 వేలు, స్టాల్ నిర్మాణానికి మరో రూ.15 వేలు వసూళ్లు చేసేవారు. మొత్తంగా రూ.50 వేలు ప్రతి వ్యాపారి నుంచి సేకరించేవారు. ప్రస్తుతం ఎంవీపీ దివాళి క్రాకర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ కేవలం అనుమతులకే రూ.55 వేలు చెల్లించాలంటూ వ్యాపారులకు హుకుం విధించినట్లు సమాచారం. స్టాల్ నిర్మాణానికి అదనంగా మరో రూ.20 వేలు దండుకుంటున్నట్లు పలువురు వ్యాపారులు వాపోతున్నారు. అవసరమైతే క్రాకర్స్‌ను ఇక్కడ ఎక్కువ రేట్లకు అమ్ముకోవచ్చని సలహా ఇస్తున్నట్లు పేర్కొంటున్నారు. దీంతో ఎక్కువ డబ్బులు ఇచ్చేందుకు ముందుకొచ్చిన వారికే స్టాళ్లు ఇచ్చారనే ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. పార్టీ, జీవీఎంసీ, పోలీసులు, గ్రౌండ్ యాజమాన్యం ఇలా అందరినీ మేనేజ్ చేయాలంటే కేవలం అనుమతులకే రూ.55 వేలు చెల్లించాలని పేర్కొంటున్నట్లు తెలిసింది. అసోసియేషన్ పేరుతో కూటమి నాయకులు చేస్తున్న దోపిడీపై వ్యాపారులంతా అసహనం వ్యక్తం చేస్తున్నారు.

ప్రభుత్వ అలసత్వంతో వ్యాపారులకు నష్టం



దీపావళి క్రాకర్స్ విషయంలో చాలా మంది వినియోగదారులు ముందస్తు ప్రణాళికతో ఉంటారు. ముందుగానే సామగ్రి కొని భద్రపరచుకుంటారు. ఇది వ్యాపారులకు, కొనుగోలుదారులకు మంచి ఉపశమనంగా ఉంటుంది. గత ఐదేళ్ల వైఎస్సార్‌సీపీ పాలనలో ఈ తరహా విధానమే కొనసాగింది. ఈ ఏడాది కూటమి ప్రభుత్వం వ్యాపారులకు సకాలంలో అనుమతులు, విక్రయ ప్రదేశాలు కేటాయించకపోవడంతో ఇప్పటికే వ్యాపారులు 20 శాతం నష్టపోయారు. దీనికి తోడు చాలా చోట్ల కూటమి నాయకులు అనుమతులు, విక్రయ కేంద్రాల ఎంపికలో ఇబ్బందులకు గురిచేస్తుండటంతో వ్యాపారులు తీవ్ర ఆవేదన చెందుతున్నారు. విశాఖలో ఈ తరహా వ్యవహారాలు ఎక్కువగా జరుగుతున్నాయి.

– ప్రేమ్‌కుమార్,
ప్రేమ్ అండ్ కో దివాళి క్రాకర్స్ వెల్ఫేర్ అసోసియేషన్

శ్రీకృష్ణాపురం గురుకులంలో 'ఓపెన్ హౌస్'



గురుకుల విద్యార్థులకు పోలీస్ విధులపై అవగాహన కల్పిస్తున్న ఆరిలోవ పోలీసులు

ఆరిలోవ: ఓపెన్ హౌస్ ప్రొగ్రాంలో భాగంగా ఆదివారం ఆరిలోవ పోలీసులు 13వ వార్డు శ్రీకృష్ణాపురంలోని డాక్టర్ బి.ఆర్.అంబేడ్కర్ సాంఘిక సంక్షేమ గురుకులంలో విద్యార్థులకు పోలీస్ శాఖపై అవగాహన కల్పించారు. ద్వారకా ఏసీపీ రాంబాబు ఆధ్వర్యంలో సీఐ హెచ్.మల్లేశ్వరరావు, ఎస్‌ఐలు, సిబ్బంది విద్యార్థులకు పోలీసులు బాధ్యతలు, విధి విధానాల గురించి వివరించారు. పోలీస్ తుపాకులు చూపించి వాటి పనితీరు, ఏయే సమయాలలో వాటిని వినియోగించాల్సి వస్తుంది, కంప్యూటర్ వర్క్, రికార్డుల నమోదు తదితర అంశాలపై తెలియజేశారు. నేరాలు చేసే వారిపై ఎలాంటి చర్యలు చేపడతారు, నేర నియంత్రణకు ముందు జాగ్రత్తగా ఎలాంటి చర్యలు చేపట్టాలి తదితర వాటి గురించి వెల్లడించారు. ఈ సందర్భంగా ద్వారకా ఏసీపీ రాంబాబు మాట్లాడుతూ విద్యార్థులు క్రమశిక్షణతో చదువుకోవాలని, మంచి మార్గంలో నడవాలని సూచించారు. గంజాయి, మద్యం తదితర మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలన్నారు. గురుకుల సిబ్బంది పాల్గొన్నారు.

వృక్షజాతుల సంరక్షణ అవసరం



శాస్త్రవేత్త ఎస్.ఎస్.దాస్‌కు జ్ఞాపిక అందిస్తున్న ఏయూ వీసీ శశిభూషణరావు

మద్దిలపాలెం: వృక్షజాతుల సంరక్షణతోనే పర్యావరణాన్ని పరిరక్షించగలమని ఏయూ వీసీ ఆచార్య జి.శశిభూషణరావు అన్నారు. వృక్షశాస్త్ర విభాగం ఆధ్వర్యంలో 'తూర్పు కనుమల్లోని స్థానిక వృక్షజాతుల పరిరక్షణ' అనే అంశంపై రెండు రోజుల పాటు నిర్వహిస్తున్న వర్క్‌షాప్‌ను ఆదివారం ఆయన ప్రారంభించి మాట్లాడారు. స్థానిక వృక్షజాతులను సంరక్షించడం ఎంతో అవసరమన్నారు. అణుబాంబుల వల్ల పర్యావరణానికి జరిగిన నష్టాన్ని వివరించారు.

బొటానికల్ సర్వే ఆఫ్ ఇండియా కోల్‌కతా శాస్త్రవేత్త డాక్టర్ ఎస్.ఎస్.దాస్ మాట్లాడుతూ సంగీతానికి సైతం స్పందించే గుణం మొక్కలకు ఉందని ఇటీవల పరిశోధనలు స్పష్టం చేశాయన్నారు. ప్రకృతితో కలిసి ప్రయాణించడం అలవాటు చేసుకోవాలని సూచించారు. శాస్త్ర సంబంధమైన జ్ఞానాన్ని సేకరించడం, సరిచూసుకోవడం, దానిని భద్రపరచడం ఎంతో అవసరమన్నారు. సదస్సు కన్వీనర్ ఆచార్య ఎస్.బి.పడాల్ మాట్లాడుతూ ఏయూ బొటానికల్ గార్డెన్‌లో 30కి పైగా అరుదైన జాతులను సంరక్షిస్తున్నామని తెలిపారు. తూర్పు కనుమల ప్రత్యేకతలు, సదస్సు విశిష్టతను వివరించారు. సైన్స్ కళాశాల ప్రిన్సిపాల్ ఆచార్య ఎం.వి.ఆర్.రాజు మాట్లాడుతూ మైనింగ్, టూరిజం, అడవులను ఆక్రమించడం వంటి చర్యల ఫలితంగా అటవీ విస్తీర్ణం తగ్గిపోతూ సహజ వృక్షజాతులు దెబ్బతింటున్నాయన్నారు. అటవీ శాఖ ప్రజలను చైతన్యపరిచే కార్యక్రమాలను రూపొందించి నిర్వహించాల్సిన విధానాన్ని తెలియజేశారు. విభాగాధిపతి ఆచార్య డి.సంధ్యాదీపిక మాట్లాడుతూ విభాగ ప్రగతిని వివరించారు. శాస్త్రవేత్త ఎస్.ఎస్.దాస్‌కు ఏయూ తరఫున వీసీ జ్ఞాపిక అందజేశారు. కార్యక్రమంలో విభాగ ఆచార్యులు రత్నకుమార్, సుజాత, బలరామ స్వామి యాదవ్, సంధ్యశ్రీ, ఎస్.ఎన్.దొర, విశ్రాంత ఆచార్యులు వెంకయ్య హర శ్రీరాములు, సీడీసీ డీన్ టి.వెంకటకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

సాగరతీరంలో పావురాల సందడి



కపోతాలకు గింజలు వేస్తున్న సందర్శకుడు

ఏయూక్యాంపస్: సాగరతీరంలో కపోతాలు సందడి చేస్తున్నాయి. నిత్యం సాగర తీరానికి కాలక్షేపానికి వచ్చే ప్రజలు పావురాలకు గింజలు, ఆహారం అందిస్తున్నారు. దీంతో నిత్యం ఉదయం పదుల సంఖ్యలో కపోతాలు సాగరతీరంలో వాలిపోతున్నాయి. సందర్శకులు అందించే ఆహారం, గింజలు తింటూ ముచ్చట గొలుపుతున్నాయి.

డ్వాక్రా బజార్ ఏర్పాటు

ఆరిలోవ: ఎంవీపీ రైతుబజార్‌లో ఆదివారం డ్వాక్రా బజార్ ఏర్పాటు చేశారు. ఇది ఒక్క రోజు మాత్రమే నిర్వహించారు. దీన్ని ఎమ్మెల్యే వెలగపూడి రామకృష్ణబాబు ప్రారంభించారు. ప్రతి నెలలో ఒక రోజు ఇక్కడ డ్వాక్రా బజార్ నిర్వహిస్తామని యూసీడీ అధికారులు తెలిపారు. డ్వాక్రా మహిళలు స్వయంగా తయారు చేసిన చేనేత వస్త్రాలు, వివిధ రకాల బొమ్మలు, ఇంటి అలంకరణ వస్తువుల విక్రయానికి అవకాశం కల్పించినట్లు చెప్పారు. వినియోగదారులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. రైతుబజార్ ఈవో జి.ప్రసాద్, సిబ్బంది కనకరాజు పాల్గొన్నారు.

30న బాణసంచాపై చైతన్య శిబిరం

మద్దిలపాలెం: బాణసంచా కాల్చడం ద్వారా సంభవించే దుష్పరిణామాలపై సుప్రీం కోర్ట్ సూచనలకు అనుగుణంగా యువతలో చైతన్యం తీసుకొచ్చేందుకు ఈ నెల 30న బాల వికాస్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో శిబిరం నిర్వహించనున్నట్లు సంస్థ ప్రతినిధి ప్రకాశరావు తెలిపారు. బుధవారం ఉదయం 11 గంటలకు ఎంవీపీ కాలనీలోని ఎ.ఎస్.వి.వి.పి. డిగ్రీ కళాశాల సెమినార్ హాల్‌లో చైతన్య శిబిరం జరగనుందన్నారు. కేజీహెచ్ ఈఎన్‌టీ సీనియర్ వైద్య నిపుణుడు డాక్టర్ బి.మురళీకృష్ణ పాల్గొని ఈ అంశంపై ప్రసంగిస్తారని చెప్పారు.

మొక్కలు నాటుదాం



మొక్కలతో వెంకోజీపాలెం వాసులు

మద్దిలపాలెం: ప్రతి ఒక్కరూ ఏదో ఒక చిన్న మొక్కనైనా నాటి భావితరాలకు పచ్చదనాన్ని అందిద్దామని కొత్త వెంకోజీపాలెం గ్రామ సేవా సంఘం మాజీ అధ్యక్షుడు మద్దాల వీరవెంకట అప్పారావు పిలుపునిచ్చారు. ఆయన జన్మదినం సందర్భంగా ఆదివారం గ్రామస్తులందరి చేత స్థానిక శివాలయం ప్రాంగణంలో మొక్కలు నాటించారు. సంఘ అధ్యక్షుడు పీల కనకరాజు, కార్యవర్గ సభ్యులు పాల్గొన్నారు.

ఉత్సాహంగా లడ్డూ మేకింగ్



పోటీల్లో లడ్డూ తయారు చేస్తున్న మహిళలు

ఏయూక్యాంపస్: పండగ అనగానే ఠక్కున గుర్తొచ్చేవి లడ్డూలు. ఈ సంప్రదాయాన్ని గుర్తు చేసేలా బీచ్ రోడ్డులోని నోవాటెల్‌లో ఆదివారం లడ్డూ మేకింగ్ వేడుక నిర్వహించారు. దీనికి శ్రావ్యమైన వీణా కచేరీ, చక్కని సంగీతం తోడవగా.. ఎదురుగా సాగర తీరాన్ని తిలకిస్తూ ఈ కార్యక్రమంలో నగరవాసులు, హోటల్‌కు విచ్చేసిన అతిథులు ఉత్సాహంగా పాల్గొన్నారు. ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన టేబుళ్లపై తమకు ఇచ్చిన బూందీని లడ్డూగా తయారు చేసి సందడి చేశారు. మహిళలను ఆకట్టుకునే రంగోలీ, అలంకరణ వస్తువులు, నోరూరించే ఆహార పదార్థాలను ఇక్కడ ఏర్పాటు చేశారు.

మద్యం దుకాణాన్ని వ్యతిరేకిస్తూ వంటావార్పు



మద్యం దుకాణం వద్దంటూ వంటావార్పు ద్వారా నిరసన తెలుపుతున్న పందిమెట్ట ప్రాంత వాసులు

బీచ్‌రోడ్డు: జీవీఎంసీ 28వ వార్డు దసపల్లా హిల్స్ దరి పందిమెట్ట ప్రాంతంలో మద్యం దుకాణం ఏర్పాటును వ్యతిరేకిస్తూ ఆదివారం రోడ్డుపై స్థానికులు వంటావార్పు నిర్వహించారు. ఐద్వా నాయకురాలు కె.మణి మాట్లాడుతూ తమ ప్రాంతంలో నిబంధనలకు వ్యతిరేకంగా వైన్ షాప్ ఏర్పాటు చేస్తున్నారన్నారు. మా గ్రామ దేవత ఆలయం పక్కనే మద్యం దుకాణం పెట్టేందుకు ప్రయత్నిస్తున్నారని తెలిపారు. మా ప్రాంతంలో దుకాణం అనుమతులను రద్దు చేసే వరకు తమ నిరసన కార్యక్రమం కొనసాగుతుందని చెప్పారు. కార్యక్రమంలో అధిక సంఖ్యలో స్థానిక మహిళలు పాల్గొన్నారు.

కైలాసగిరిపై వెలగని శంకు చక్రాలు



శంకు చక్రాల దీపాలు వెలగకపోవడంతో చీకటిమయమైన కైలాసగిరి

ఆరిలోవ: పర్యాటక కేంద్రం కైలాసగిరిపై శంకు చక్రాలు వెలగడం లేదు. కైలాసగిరిపై వెంకటేశ్వర నామాలు, శంకు చక్రాలు ఏర్పాటు చేశారు. వీటిని విద్యుత్ దీపాలతో అలంకరించారు. ఈ లైట్లు రాత్రిళ్లు వెలుగుతూ నగరంలో ప్రజలను కనువిందు చేసేవి. కొద్ది రోజులుగా ఇవి వెలగడం మానేశాయి. వీఎంఆర్‌డీఏ అధికారులు మాత్రం వీటిని పట్టించుకుండా వదిలేశారు. దీపాలు వెలగకపోవడంతో రాత్రి వేళ ఈ కొండపై వెంకటేశ్వర నామాలు, శంకు చక్రాలు కనిపించడం లేదు. కొండపైన అంతా చీకటిమయమైంది. అధికారులు స్పందించి శంకు చక్రాల దీపాలు వెలిగించాలని సందర్శకులు కోరుతున్నారు.

ఆ స్థలాన్ని జూనియర్ కళాశాలకు కేటాయించాలి



సమావేశమైన పలు కాలనీల సంఘాల ప్రతినిధులు

ఆరిలోవ: ఆరిలోవ ప్రాంతంలో జూనియర్ కళాశాల కోసం అధికారులు స్థలం కేటాయించాలని స్థానిక ప్రజా సంఘాల ప్రతినిధులు కోరుతున్నారు. ఎర్నిదుర్గమాంబ ఆలయం ప్రాంగణంలోని కల్యాణ మండపంలో ఆదివారం మాజీ కార్పొరేటర్ ఒమ్మి సన్యాసిరావు ఆధ్వర్యంలో స్థానిక ప్రజా సంఘాల ప్రతినిధులు సమావేశం నిర్వహించారు. ఆరిలోవలోని తోటగరువు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల, ప్రైవేట్ స్కూళ్ల నుంచి ప్రతి ఏటా సుమారు 1,000 మందికి పైగా పదో తరగతి విద్యార్థులు రిలీవ్ అవుతున్నారని, వారి కోసం ప్రభుత్వ జూనియర్ కళాశాల అవసరమని చర్చించారు. ఈ సందర్భంగా సన్యాసిరావు మాట్లాడుతూ ఈ ప్రాంతంలో షటిల్ బ్యాడ్మింటన్ అకాడమీ కోసం బ్యాడ్మింటన్ స్టార్ పి.వి.సింధుకు ప్రభుత్వం రెండెకరాల స్థలాన్ని కేటాయించిందన్నారు. దీనిని రద్దు చేసి అదే స్థలాన్ని జూనియర్ కళాశాల నిర్మాణం కోసం కేటాయించాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. సంబంధిత వినతిపత్రాలను రూరల్ తహసీల్దార్, ఎమ్మెల్యే, కలెక్టర్‌తోపాటు రాష్ట్ర విద్యా శాఖ మంత్రికి పంపించామని తెలిపారు. ఇదిలా ఉండగా.. కళాశాలతోపాటు బ్యాడ్మింటన్ అకాడమీ కూడా ఈ ప్రాంతంలో ఉండటం అవసరమని, కాలేజీ కోసం ప్రభుత్వం వేరే చోట స్థలం కేటాయిస్తే మంచిదని స్థానికులు భావిస్తున్నారు.

2 నుంచి విద్యార్థులకు పోటీలు



పోటీల పోస్టర్ ఆవిష్కరిస్తున్న చైర్మన్ దుర్గాప్రసాద్, లయన్ క్లబ్ సభ్యులు

బీచ్‌రోడ్డు: బాలల దినోత్సవాన్ని పురస్కరించుకుని విద్యార్థులకు పోటీలు నిర్వహించనున్నట్లు లయన్స్ బ్లడ్ బ్యాంక్ ట్రస్ట్ చైర్మన్ ఆచార్య ఎన్.వి.ఎస్.దుర్గాప్రసాద్ తెలిపారు. రామ్‌నగర్ లయన్స్ కమ్యూనిటీ హాల్‌లో ఆదివారం విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. నవంబర్ 2 నుంచి 14 వరకు ప్రతి రోజు విద్యార్థులకు పోటీలు జరుగుతాయని చెప్పారు. లయన్స్ క్లబ్ విశాఖపట్నం బాలల దినోత్సవ ఈవెంట్ చైర్మన్ లయన్ ప్రసాదరాజు మాట్లాడుతూ 6, 7, 8 తరగతుల విద్యార్థులను జూనియర్స్‌గా, 9, 10 తరగతులు చదువుతున్న 14 ఏళ్ల లోపు విద్యార్థులను సీనియర్ గ్రూప్‌గా విభజించామని తెలిపారు. నవంబర్ 2న పెయింటింగ్, 3న వ్యాసరచన, 4న వ్యక్తృత్వ, 5న క్విజ్, 6న జానపద నృత్యాలు, 7న ఫ్యాన్సీ డ్రెస్, 8న పాటలు, 9న దేశభక్తి గీతాలు, 10న యోగా, చెస్, 11న సైన్స్ ఫెయిర్ పోటీలు నిర్వహిస్తున్నట్లు వెల్లడించారు. బాలల దినోత్సవ పోస్టర్‌ను లయన్ చంద్రశేఖర్, సభ్యులు ఆవిష్కరించారు.

హైడ్రో వాటర్‌పై అవగాహన



ప్రారంభోత్సవంలో పాల్గొన్న అతిథులు

ఏయూక్యాంపస్: హైడ్రోజన్ వాటర్‌పై విశాఖలో అవగాహన కల్పిస్తూ అయాన్ ఎక్స్చేంజ్(ఇండియా) సంస్థ విశాఖలో అడుగిడింది. బీచ్ రోడ్డులోని ఒక హోటల్‌లో ఆదివారం జరిగిన ఈవెంట్‌లో ది మోడరన్ లివింగ్(టీఎంఎల్) అవగాహన కార్యక్రమం నిర్వహించారు. విశాఖలోని నూతన డివిజన్‌కు చెందిన కొప్పిశెట్టి మురళీకృష్ణ బాధ్యతలు స్వీకరించారు. కార్యక్రమంలో టీఎంఎల్ కంట్రీ హెడ్ రవికాంత్, శ్రీనివాస్, డాక్టర్ అప్పారావు, డాక్టర్ జయకుమార్, రొటేరియన్ రాథోడ్, భిమల్ తదిరతులు పాల్గొన్నారు.

మాలధారులకు నిత్యాన్నదానం ప్రారంభం



కొత్త వెంకోజీపాలెంలో స్వాములకు అన్నప్రసాదం వడ్డిస్తున్న సంఘం సభ్యులు

మద్దిలపాలెం: జీవీఎంసీ 15వ వార్డు కొత్త వెంకోజీపాలెంలోని గ్రామ సేవా సంఘం ఆధ్వర్యంలో ప్రతీ ఏటా మాదిరిగా ఆదివారం మాలధారులకు నిత్యాన్నదానం ప్రారంభించారు. ధర్మశాస్తా అయ్యప్ప స్వామి ఆలయం వద్ద సంఘ అధ్యక్షుడు, కార్యవర్గ సభ్యులు స్వాములకు అన్నప్రసాద వితరణ చేశారు. ఈ సందర్భంగా సంఘ అధ్యక్షుడు పీలా కనకరాజు మాట్లాడుతూ 8 ఏళ్లుగా స్వాములకు నిత్యాన్నదానం కొనసాగిస్తున్నామని తెలిపారు. దాతల సాయంతో ప్రతి రోజు మధ్యాహ్నం 12.30 నుంచి 2 గంటల వరకు 41 రోజుల పాటు ఈ కార్యక్రమం జరుగుతుందని చెప్పారు. మాలధారులందరూ ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో ప్రధాన కార్యదర్శి కాళ్ల పోలినాయుడు, ఉపాధ్యక్షుడు పీలా నాగేశ్వరరావు, మాజీ అధ్యక్షుడు మద్దాల వీరవెంకట అప్పారావు, ఆడిటర్ లోకేష్, ఆలయ కమిటీ సభ్యులు ఎస్.నరసింహారెడ్డి, కాళ్ల వరహాలు, సాంబ, మద్దాల నరసింగరావు, అప్పలరాజు, ఆలయ అర్చకులు ఆరవెల్లి సూర్యప్రకాష్ శర్మ, సుబ్రహ్మణ్యశాస్త్రి, బాల భాస్కరశర్మ పాల్గొన్నారు.

మరుగున పడిన మరుగుదొడ్లు

- ప్రభుత్వ మానసిక ఆస్పత్రిలో మరమ్మతులకు నోచుకోని టాయిలెట్లు
- ఇబ్బందులు పడుతున్న రోగులు, వారి బంధువులు
- పట్టించుకోని ఆస్పత్రి ఉన్నతాధికారులు



ఆస్పత్రి ముఖద్వారం వద్ద తాళం వేసి ఉన్న వాష్ రూమ్





నీటి సదుపాయం లేని వాష్ బేసిన్, మూత్ర విసర్జన బేసిన్



బాత్‌రూమ్‌లో పాడైన పరికరాలు

బీచ్‌రోడ్డు: నగరం నడిబొడ్డున గల పెదవాల్తేరు ప్రభుత్వ మానసిక ఆస్పత్రిలో మరుగుదొడ్లు మరుగున పడ్డాయి. నిరంతరం రోగులు, వారి బంధువులతో రద్దీగా ఉండే ఈ ఆస్పత్రిలో మూత్ర, మల విసర్జన చేయాలంటే సరైన మరుగుదొడ్లు లేవు. దీంతో రోగులు, వారితో వచ్చిన బంధువులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఆస్పత్రి ఉన్నతాధికారులు మాత్రం మరుగుదొడ్ల మరమ్మతులను పట్టించుకోవడం లేదు. వెంటనే టాయిలెట్లనుబాగుచేసి తమ ఇబ్బందులు తొలగించాలని రోగులు, వారి బంధువులు విజ్ఞప్తి చేస్తున్నారు.

నీటి సదుపాయం లేదు

మానసిక ఆస్పత్రిలోని గ్రౌండ్ ఫ్లోర్‌లో ఉన్న మరుగుదొడ్లకు నీటి సదుపాయం లేక భయానకంగా మారాయి. నీటి సరఫరా సరిగ్గా జరగడం లేదు. వాష్ బేసిన్, మూత్ర విసర్జన చేసే బేసిన్‌కు నీటి సదుపాయం లేకపోవడంతో రోగులు, వారి బంధువులు వాటిని వినియోగించుకోవడానికి ఇబ్బందులు పడుతున్నారు.

టాయిలెట్ల మూసివేత

ఆస్పత్రి ప్రధాన ముఖద్వారం వద్ద ఉన్న రెండు మరుగుదొడ్లకు తాళం వేసి మూసేశారు. దీంతో ఓపీ కోసం వచ్చిన రోగులు, వారి బంధువులు సరైన సదుపాయం లేని మరుగుదొడ్లనే వినియోగించాల్సి వస్తోంది. పైగా అవి కూడా ఎక్కడ ఉన్నాయోనని అందరినీ ఆరా తీసుకుంటూ వెళ్తే తప్ప కనిపించవు. అంత లోపలకు మరుగుదొడ్లు ఉన్నాయి. మూసివేసిన మరుగుదొడ్లను రోగులకు అందుబాటులోకి తీసుకొస్తే ఇబ్బందులు తొలగుతాయని పలువురు కోరుతున్నారు.

మానవ హక్కుల కౌన్సిల్ ఆత్మీయ సమ్మేళనం



ఆత్మీయ సమావేశంలో పాల్గొన్న సభ్యులు

మద్దిలపాలెం: మానవ హక్కుల కౌన్సిల్ సభ్యుల ఆత్మీయ సమ్మేళనం ఆదివారం మద్దిలపాలెంలోని ఓ ఫంక్షన్ హాల్‌లో ఘనంగా జరిగింది. ఈ సందర్భంగా కౌన్సిల్ సభ్యులు ఆటపాటలతో అలరించారు. సంస్థ కార్యవర్గ సభ్యుడు ఎస్వీ రమణ నిర్వహణలో ముఖ్య అతిథి కౌన్సిల్ రాష్ట్ర కార్యదర్శి మంత్రి శ్యాం ప్రసాద్ వేడుకలు ప్రారంభించారు. ఆయన ప్రసంగిస్తూ మానవ హక్కుల పరిరక్షణకు నిత్యం కృషి చేస్తున్న హ్యూమన్ రైట్స్ డిఫెండర్స్ మానసిక ఉల్లాసం కోసం ఇటువంటి కార్యక్రమాలు నిర్వహించడం ద్వారా వారిలో ఉత్సాహాన్ని పెంపొందించామని తెలిపారు. సోషల్ మీడియా స్టేట్ చైర్మన్ సన్ మూర్తి, కౌన్సిల్ కార్యవర్గ సభ్యులు సత్యనారాయణ, అప్పారావు, సత్యశ్రీ, తదితరులంతా న్యాయ నిర్ణేతలుగా వ్యవహరించి వినోద కార్యక్రమంలో పాల్గొన్న కళాకారులను అభినందించారు. పాటలు నృత్యాలు, జోక్స్, చిన్న చిన్న గేమ్స్ నిర్వహించి.. బహుమతులు ప్రదానం చేశారు.